
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్
భూపాలపల్లి

మంగళవారం 11 మార్చి 2025





ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల కేటాయింపు విషయంలో ఇటు అధికార కాంగ్రెస్, దాని మిత్రపక్షం సీపీఐ.. అటు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఊహించని నిర్ణయాలు తీసుకున్నాయి. ఆయా పార్టీల నుంచి ఎమ్మెల్సీల పదవులకు కొందరి పేర్లు వినిపించినా.. ఆశావహులు లాబీయింగ్ చేసినా.. వారందరికీ ఝలక్ ఇస్తూ.. అనూహ్యంగా వేరే నేతలకు ఆ పదవులను కట్టబెట్టాయి. ఈ క్రమంలో పెద్దల సభలో అడుగుపెట్టాలనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ముఖ్యంగా ఈ మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉమ్మడి ఓరుగల్లు నేతలకే అవకాశం ఉండబోతోందన్న ప్రచారం జరగ్గా.. అదంతా తారుమారైంది. ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ నేతల్లోని అనైక్యతే ఎవరికీ పదవి రాకుండా చేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కాంగ్రెస్ తన మిత్రపక్షంగా ఉన్న సీపీఐకి ఒక సీటు కేటాయించగా.. ఆ పదవికి ఉమ్మడి ఓరుగల్లు నుంచి ఒకరిని ఎంపిక చేయబోతున్నారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. 'గులాబీ' పార్టీ నుంచి మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, లేదంటే ఎర్రబెల్లి దయాకర్‌రావు పెద్దల సభకు వెళ్లబోతున్నారంటూ వార్తలొచ్చాయి. కానీ ఈ రెండు పార్టీలు కూడా ఝలక్ ఇచ్చాయి. దీంతో ఓరుగల్లు నేతలు ఇప్పుడు అంతర్మథనంలో పడ్డారు. తమకు పదవులు రాకపోవడానికి కారణాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



- కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్‌లోని ఆశవాహులకు దక్కని ఛాన్స్
- గంపెడాశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలకు చుక్కెదురు
- నేతల మధ్య అనైక్యతే కొంపముంచిందా?
- ఫలించని మధ్యవర్తిత్వాలు, లాబీయింగ్
- వారికి పార్టీ పదవులైనా దక్కుతాయా?
- బీఆర్ఎస్, సీపీఐ నేతలకూ మిగిలింది మొండిచేయే..

## దక్కని అవకాశం.. నేతల్లో అంతర్మథనం!

### 'ఎమ్మెల్సీ'లో ఓరుగల్లు నాయకులకు ఝలక్ ఇచ్చిన పార్టీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు నేతలకు అటు కాంగ్రెస్, సీపీఐ.. ఇటు బీఆర్ఎస్ అధిష్టానాలు ఝలక్ ఇచ్చాయి. ఎమ్మెల్సీ సీటు పక్కా అనుకున్న నేతలకు పరాభావం తప్పలేదు. కాంగ్రెస్ నేతలు ఏడాది కాలంగా ఎమ్మెల్సీ సీటుపై ఆశలతో అధిష్టానంపై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందనే నైరాశ్యంలో ఉన్నారు. తమకు పదవులు దక్కపోవడం వెనుక కారణాలేంటా అని అంతర్మథనం చెందుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య అనైక్యతే ఎవరికి పదవి రాకుండా చేసిందనే చర్చ జరుగుతోంది. మరోవైపు పీసీసీ పదవులు కూడా ఓరుగల్లు నేతలకు దక్కేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆధిపత్య పోరులో ఒకరికి రాకుండా మరోకరు అధిష్టానంపై ఒత్తిళ్లు చేస్తుండటంతో ఎమ్మెల్సీ సీటు తరహాలోనే టీపీసీసీ పదవులు కూడా దూరమయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి మరోసారి చాన్స్ తనకే అనే ధీమాతో ఉన్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు అధిష్టానం షాక్ ఇచ్చింది. ఇక పొత్తులో భాగంగా వచ్చే ఆ ఒక్క సీటు కూడా వరంగల్ సీపీఐకే దక్కుతుందని భావించినా కామ్రేడ్లు సైతం ఝలక్ ఇవ్వటంతో ఎమ్మెల్సీ సీటును ఆశించిన వారిలో నిరాశ ఆవహించింది. అయితే ఓరుగల్లు మూలలు ఉన్న సినీనటి విజయశాంతికి ఎమ్మెల్సీ రావటం కొంత ఊరటగా భావిస్తున్నారు.


**కాంగ్రెస్ ఆశవాహులకు నిరాశే...**

కాంగ్రెస్ ఎమ్మెల్సీ పదవి కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో డజను మందికి పైగా ఆశలు పెట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం లేనివారు, పోటీ చేసేందుకు చాన్స్ దక్కనివారు, సీనియర్ నేతలు ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరిలో ప్రధానంగా మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మొదటి నుంచి ఎమ్మెల్సీ పదవిపై ఆశతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నుంచి కొండా మురళీ పోటీకి ప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో ఒకే కుటుంబంలో ఇద్దరికి టికెట్ కష్టమని, ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తాని పార్టీ హామీ ఇచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కొండా మురళీకి పదవిపై హామీ ఇచ్చారు. దీంతో ఈసారి పక్కాగా కొండాకు ఎమ్మెల్సీ పదవి ఖాయమనున్నారు. కానీ, అనూహ్యంగా కొండా మురళి పేరు జాబితాలో లేకపోవటంతో ఆయన వర్గీయులు కంగుతిన్నారు. మరోవైపు సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పేరు కూడా చివరి నిమిషంలో ప్రముఖంగా వినిపించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా వేంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సీఎం, టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. అయితే వేం నరేందర్‌రెడ్డికి కూడా ఎమ్మెల్సీ చాన్స్ రాకపోవటం ఆయన వర్గీయుల్లో నిరాశకు గురయ్యారు. ఇక మరో నాయకుడు దొమ్మాటి సాంబయ్యకు కూడా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు అప్పటి ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షిని కలిసి లేఖ అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కూడా విజ్ఞప్తి చేసినా సాంబయ్యకు అధిష్టానం ఝలక్ ఇచ్చిందనే టాక్ వినబడుతోంది. మరోవైపు స్టేషన్‌ఘనపూర్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటి చేసి ఓడిపోయిన శనిగపురం ఇందిరాకు సైతం ఎమ్మెల్సీ పదవి అందని ద్రాక్షగానే మిగిలింది. కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే ఇందిరాకు అధిష్టానం పదవిపై హమి ఇచ్చింది. వీరితో పాటు మరికొంత మంది నేతలు ఎమ్మెల్సీ సీటుపై ఆశతో అధిష్టానంపై ఒత్తిళ్లు తెచ్చిన ఫలితం లేకపోవటంతో

మిగతా 7వ పేజీలో...

## నేడు కొండపర్తికి గవర్నర్

- దత్తత గ్రామానికి రానున్న జిష్ణుదేవ్ వర్మ
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- గ్రామస్థులతో సమావేశం.. అనంతరం సమ్మక్క సారలమ్మల దర్శనం





తాడ్వాయి మండలం కొండపర్తిలో గవర్నర్ నిధులతో నిర్మించిన పాఠశాల భవనం

7లో

## వైభవంగా లక్ష్మీనరసింహా స్వామి కల్యాణం

### భక్తులతో కిటకిటలాడిన కోటంచ ఆలయం



స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రేగొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటంచ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం ధ్వజారోహణంలో భాగంగా వేదపం డితులు గరుడముద్దను భక్తులకు అందజేశారు. సాయంత్రం స్వామివారిని అశ్వవాహనంలో డప్పు చప్పుళ్ల మధయ పురవీధుల్లో ఊరేగించారు. పట్టువస్త్రాలు, పూలతో లక్ష్మీదేవి, నరసింహస్వామిని అలంకరించారు. అనంతరం లక్ష్మీదేవిసమేత

మిగతా 8వ పేజీలో...

## వినతులపై సత్వరమే స్పందించాలి

### అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



ప్రజావాణిలో మహిళ సమస్య వింటున్న అదనపు కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తునూ పరిశీలించి అర్జీదారులకు సమాధానం ఇవ్వాలన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిధిలో పరిష్కరమయ్యే సమస్యలను తహసీల్దార్ కార్యాలయంలోనే వినతులు చేసుకోవాలని సూచించారు. వాటి పరిష్కారానికి ప్రతి శాఖలోనూ ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 45 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వ్యవస్థపై గౌరవం పెరగాలి

### ఎస్పీ కిరణ్‌ఖరే



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత గౌరవం పెరిగేలా పోలీసులు సమర్థంగా పనిచేయాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 22 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. వాటిపై ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్లో మాట్లాడుతూ సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని, వారితో స్నేహభావంగా మెలుగుతూ వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు , శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు.

## నీళ్లు లేక పంటలు ఎండిపోవద్దు

### వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల

వివరాలు 8వ పేజీలో...

## మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు..

- కాంగ్రెస్ పాలనపై జనానికి స్పష్టత వచ్చింది
- ఇక ఏ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్‌దే విజయం
- వచ్చే నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

హనుమకొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారని, కేసీఆర్ గొంతు వినాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు హరీష్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికే తలమానికంగా నిలిపారని కొనియాడారు. పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడిన కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ ప్రారంభించిన పథకాలు దేశానికి దిక్సూచిగా నిలిచాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సహా ఏ ఎన్నికలు వచ్చినా ఇక బీఆర్ఎస్‌దే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

యేడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలకు ఒక స్పష్టత వచ్చిందని హరీష్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తి పోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 15 నెలల పాలనలో 15 ఇళ్లను కూడా నిర్మించలేదని విమర్శించారు. హుజూరాబాద్, మునుగోడులో అమ్ముడుబోయి డిపాజిట్ కోల్పోయిన చరిత్ర రేవంత్‌రెడ్డిదేనని ఆరోపించారు. రాహుల్ గాంధీ గుజరాత్ సభలో కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు గురించి మాట్లాడారని, తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి మోదీ మంచోడని మాట్లాడుతున్నారని.. ఇక్కడ కోవర్టులు ఎవరో రాహుల్‌గాంధీ తెలుసుకో వాలని సూచించారు. రేవంత్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మ రించిందని, కానీ బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేసిందని హరీష్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల గొంతుకగా ఆవిర్భవించిన ఉద్యమ పార్టీ అని హరీష్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ వేడుక లను వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 27న ప్రారంభించి ఏడాది పా టు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాకతీ యుల తోరణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లేకుండా చేశారని, కానీ కాకతీయులు పాలించిన గడ్డమీదనే ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహించబోతోందని హరీష్‌రావు తెలిపా రు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మార్చి 10న మిలియన్ మార్చ్ నిర్వహించిన రోజున వరంగల్‌కు రావడం.. 25 ఏళ్ల ఉద్యమ పార్టీ సభా స్థలి పరిశీలనకు రావడం సంతోషంగా ఉందన్నారు. 14 ఏళ్ల ఉద్యమం.. 9 ఏళ్ల పాలన మేళవింపే ఈ రజతోత్సవ సభ అన్నారు. ఈ సభ కోసం వరంగల్ శివారులో రెండు స్థలాలను పరిశీలించామని, కానీ ఇంకా ఎంపిక చేయ లేదని తెలిపారు. వరంగల్‌కు బీఆర్ఎస్ పార్టీకి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. ఈ జిల్లాలో సమర్థవంతమైన నాయకులు ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినో త్సవంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని హరీష్‌రావు పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరి కొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు తాటికొండ రాజ య్య, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మె ల్యేలు కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నన్నపు నేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లోని భట్టుపల్లి ప్రాంతంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

**సభా స్థలి పరిశీలించిన నేతలు**

ఏప్రిల్ 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ కోసం సోమవారం వరంగల్‌లోని ఉనికచర్ల, భట్టుపల్లి ప్రాంతాల్లోని సభా వేదిక స్థలాలను బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. తన్నీరు హరీష్‌రావు తోపాటు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరిశీలించారు.

## ఒక పోస్టు.. విధుల్లో ఇద్దరు

### డీఏవోగా వీరునాయక్ బాధ్యతలు స్వీకరణ

### బదిలీ ఆర్డర్ రాలేదని రిలీవ్‌కాని పాత డీఏవో

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోస్టు ఒకటి.. అధికారులు ఇద్దరు. ఇద్దరూ ఒకేరోజు అనివార్యంగా డ్యూటీలు చేయాల్సి వచ్చింది. బదిలీపై వచ్చిన అధికారి బాధ్యతలు తీసుకోవడానికి రాగా, ఆ సీటుపై పాత అధికారే దర్శనమివ్వడంతో ఆయన అవాక్కయ్యారు. తనకు బదిలీ ఉత్తర్వులు రాలేదని, అందుకే రిలీవ్ కాలేదని పాత అధికారి చెప్పడంతో చేసేమీ లేక బదిలీపై వచ్చిన అధికారి కూడా విధులు నిర్వర్తించారు. ఈ అయోమయ పరిస్థితి భూపాలపల్లిలోని వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో సోమవారం చోటుచేసుకుంది.



బదిలీపై వచ్చిన డీఏవో వీరునాయక్

వ్యవసాయ శాఖ భూపాలపల్లి జిల్లా అధికారి (డీఏవో)గా వీరునాయక్ సోమవారం బాధ్యతలు స్వీక రించారు. హైదరాబాద్ నుంచి ఆయన్ను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి నెల 5న ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయ న ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అయితే, గతంలో ఇక్కడ డీఏవోగా పని చేసిన విజయభాస్కర్ ఇంకా రిలీవ్ కాలేదు. ఇన్ చార్జి డీఏవోగా ఉన్న ఆయనకు బదిలీ ఆర్డర్ రాలేదు. దీంతో ఆయన రిలీవ్ కాలేదని తెలిసింది. బదిలీపై వచ్చిన వీరునాయక్ సోమవారం కార్యాలయానికి రాగా విజయభాస్కర్‌ను చూసి ఆయన అవాక్కయ్యారు. చేసేదేమీ లేక అక్కడే సెక్షన్‌లో కూర్చున్నారు. దీంతో పాటు ప్రజావాణి కార్యక్రమానికి సైతం విజయభాస్కర్‌తో కలిసి వీరునాయక్ హాజరయ్యారు. ఒక వరుసలో వీరునాయక్, మరో వరుసలో విజయభాస్కర్ ఆసీనులయ్యారు. దీనిపై విజయభాస్కర్‌ను వివరణ కోర డానికి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

### విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా
## జాగ్రత్తలు పాటించాలి

▸▸ భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్‌నాయక్




రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ మల్సూర్‌నాయక్

రేగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్‌నాయక్ అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ పొలంబాటలో భాగంగా మండలంలోని నారాయణపురం, రామన్నగూడెం గ్రామాల్లో సోమవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, మిడిల్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ రైతులకు పలు సూచనలు చేశారు. లోఓల్టేజ్ సమస్య ఉన్నప్పుడు మోటార్ల దగ్గర కెపాసిటర్స్ పెట్టుకోవాలన్నారు. లూజ్‌వైర్లు ఉంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అక్రమంగా వైర్లు తగిలించి విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు. ఆయన వెంట ఏడీ నాగరాజు, ఏఈ రాజు, లైన్‌ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, ఏఎల్ఎంలు విజయ్, రాహుల్ పాల్గొన్నారు.

### కన్నుల పండుగగా
## పార్వతీ రామలింగేశ్వర కల్యాణం

• పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



స్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కురవి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కురవి వీరభద్రస్వామి దేవాలయానికి ఉప ఆలయంగా ఉన్న శివాలయంలో సోమవారం శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయానికి జీర్ణోద్ధారణ చేసిన తర్వాత ఆనవాయితీగా వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో నిర్వహించిన చతుర్థ కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ అర్చకులు, ఈవో సత్యనారాయణ, చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, ధర్మకర్తలు వీరభద్రస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాల వాయిద్యాల నడుమ శివాలయానికి వెళ్లి పార్వతి రామలింగేశ్వరస్వామిలకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, విజయ్, రెడ్యాల శ్రీనివాస్, సంప్రదాయబద్ధంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, యజ్ఞోపవితధారణ, బాషికా ధారణ, మధుపర్కపూజ, కన్యాదానం, సుముహూర్తం అనంతరం ప్రధాన అర్చకులు పార్వతి అమ్మవారికి రామలింగేశ్వరస్వామి వారిచే మాంగళ్యధారణ గావించారు. అంతకుముందు శివాలయంలో మహాన్యాస పూర్ణాభిషేం, వివాహానంతరం పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి బస్తాలను పరిశీలిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య



మహబూబాబాద్ మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

# భారీగా మిర్చి రాబడులు

• కేసముద్రం మార్కెట్‌కు 13వేల బస్తాల రాక
• నేడు ఖరీదులు బంద్

మహబూబాబాద్ అగ్రికల్చర్/ కేసముద్రం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం భారీగా మిర్చి రాబడులు కొనసాగాయి. మార్కెట్‌కు 275 మంది రైతులు 5,597 బస్తాల్లో తేజ రకం మిర్చిని తీసుకురాగా ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్‌మార్కెట్(ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.13,599, కనిష్ఠంగా రూ.10,010, సగటున రూ.13,219, తాలు రకం మిర్చిని 186 మంది రైతులు 525 బస్తాల్లో తీసుకురాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.6511, కనిష్ఠంగా రూ.4009, సగటున రూ.6211 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. మిర్చి యార్డులోని రెండుకవర్‌షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. ఇక మార్కెట్‌కు వస్తున్న మిర్చి రైతులకు ఉదయం 8 గంటల వరకే గేట్ ఎంట్రీ(లాట్ ఐడీ)లను జారీ చేశారు. ఆ తర్వాత వచ్చే సరుకుకు లాట్ ఐడీలను జారీ చేయకుండా యార్డులోకి అనుమతించి మరో కవర్‌షెడ్డులో బస్తాలను దిగుమతి చేయించారు. 11వేల బస్తాలు యార్డుకు రాగా, 7వేలబస్తాలకు లాట్‌ఐడీలు జారీచేసి వేలం, కాంటాలు పూర్తిచేశారు. మిగిలిన సరుకును మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా మిర్చి భారీగారావడంతో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ మురళీధర్‌రాజ్ మార్కెట్ యార్డును సందర్శించి మార్కెట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### మిర్చి రాబడులను అనుమతించేది లేదు

మానుకోట మార్కెట్ చైర్మన్ సుధాకర్

మహబూబాబాద్ మార్కెట్‌కు ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు మిర్చిని యార్డులోకి అనుమతించేది లేదని మార్కెట్ చైర్మన్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 20వేల బస్తాలకు పైగా మిర్చి రావడంతో యార్డు నిండిపోయిందని, కాంటాలు ఆలస్యమవుతున్నాయన్నారు. మిర్చి చేరి యార్డు ఖాళీ అయ్యేంత వరకు ఈనెల 12, 13 తేదీల్లో బయట నుంచి వచ్చే మిర్చిని అనుమతించేది లేదన్నారు. ఆ రెండ్రోజులు అపరాలు, పత్తి యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని చెప్పారు. 14న హోలీ, 15, 16 తేదీల్లో వారాంతపు సెలవుల కారణంగా మిర్చి, అపరాల మార్కెట్ బంద్ చేస్తున్నట్లు చెప్పారు.

### స్థానిక ఎన్నికల్లో
## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఓటమిభయంతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోందని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. బీజేపీ పార్టీ గెలుపుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, చీకటి మహేష్ గౌడ్, సింగారపు సతీష్, గుగులోతు రాంబాబు, గడ్డం అశోక్, వెన్నమల్ల అజయ్, జహేందర్ నాయక్, పల్లె సందీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు

## విద్యుత్ సిబ్బందిపై రైతుల దాడి

▸▸ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విద్యుత్ అధికారులు

పెద్దవంగర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బందిపై రైతులు దాడి చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రుతండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ వివరాల ప్రకారం... బొమ్మకల్, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లో ఏఎల్ఎంగా(అసిస్టెంట్ లైన్‌మెన్) గుగులోతు పవన్‌కల్యాణ్ విధులు నిర్వహిస్తున్నాడు. రామచంద్రుతండాలోని ట్రాన్స్‌ఫార్మర్ నెంబర్ 55-06 పరిధిలో అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లతో వ్యవసాయ మోటార్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులు అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని ఏఈ(అసిస్టెంట్ ఇంజనీరు) రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఏఈ ఆదేశాల మేరకు ఏఎల్ఎం (అసిస్టెంట్ లైన్‌మెన్) గుగులోతు పవన్‌కల్యాణ్, విలేజీ హెల్పర్స్ కేశబోయిన అశోక్, చినసాని పుల్లయ్యతో కలిసి రామచంద్రుతండా శివారులో కెనాల్ వద్ద అక్రమంగా విద్యుత్ కనెక్షలతో వినియోగిస్తున్న మోటార్లను పరిశీలించారు. అక్రమ విద్యుత్ కనెక్షలను తొలగిస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు విధులకు ఆటంకం పరుస్తూ తీవ్రపద జాలంతో బూతులు తిడుతూ దాడి చేశారు. విద్యుత్ సిబ్బందిపై జరుగుతున్న దాడిని పక్కన రైతులు అడ్డుకొని సిబ్బందిని తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సిబ్బందికి సంబంధించిన సామగ్రినిసైతం రైతులు లాక్కున్నారు. ఏఎల్ఎం పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ నామినేషన్‌కు..
## మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు

మహబూబాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అసెంబ్లీ హాల్‌లో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా కాంగ్రెస్‌నేత కేతావత్ శంకర్ నాయక్ నామినేషన్ కార్యక్రమంలో జిల్లాలోని మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, జాటోతు రామచందర్‌నాయక్ హాజరయ్యారు. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీఅయిన ఐదు స్థానాల నామినేషన్‌కు సోమవారం చివరి రోజు కావడంతో అభ్యర్థులంతా తమ నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేశావత్ శంకర్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు మానుకోట జిల్లాలోని ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, జాటోతు రాంచందర్ నాయక్ హాజరయ్యారు.



సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్న మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, జాటోతు రాంచందర్‌నాయక్



ఒగరు కాలువ నుంచి వృథాగా పోతున్న నీరు

## రామప్ప ఒగరు కాలువకు బుంగ

వెంకటాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపూర్ మండలంలోని సుప్రసిద్ధ రామప్ప దేవాలయం సరస్సు ప్రధాన కాలువల్లో ఒక్కటైన ఒగరు కాలువకు ఆదివారం రాత్రి బుంగపడి నీరు వృథాగా పోయింది. గమనించిన రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు సమచారం ఇచ్చారు. సోమవారం ఉదయం డీఈ రవీందర్, ఏఈ జయంతి, నారాయణస్వామి తూములను పరిశీలించి నీటి సరఫరా నిలివేశారు. త్వరలోనే తూములకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికడుతామన్నారు.

## సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

▸▸ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వ్యవసాయ పంటలకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి సోమవారం వారు జిల్లా కలెక్టర్లు, పోలీస్, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో నీరందించాలని, సాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న మానుకోట కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

## ఓ ఇంటి ఎదుట విద్యుత్ ఉచ్చు

• 11 కేవీ వైర్‌ను అమర్చిన దుండుగులు



11కేవీ వైర్‌కు తగిలించిన తీగ

కాటారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు 11కేవీ విద్యుత్ లైన్‌తో ఉచ్చు ఏర్పాటు చేసిన ఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని జాదవరావుపేటలో సోమవారం కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారు చర్చి సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలకు ఇనుప తీగను తగిలించి సుమారు 200 మీటర్ల దూరం వరకు తీగను సదయ్య అనే వ్యక్తి ఇంటి దర్వాజల చుట్టూ నడుముకు తగిలే స్థాయిలో వన్యప్రాణులకు ఉచ్చు పెట్టినట్లు కట్టారు. సోమవారం తెల్లవారుజామున సదయ్య ఇంటి సమీపంలోని ఓమహిళ కాలకృత్యాల కోసం దారివెంట వెళ్తుండగా తీగ కనిపించడంతో కేకలు వేసింది. దీంతో పలువురు వచ్చి దానిని పరిశీలించి ఎక్కడ వరకు ఉందో గమనించగా సదయ్య ఇంటి వద్దకు ఉన్నట్లు గుర్తించారు. తీగను గొడ్డలితో నరికివేసిన అనంతరం సదయ్యను పిలవడంతో బయటకు వచ్చి భయాందోళనకు గురయ్యాడు. కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై-2 శ్రీనివాస్ సిబ్బందితో కలిసి జాదరావుపేటకు వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దామెరకుంట సబ్‌స్టేషన్ నుంచి వేసిన 11కేవీ విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరాను గతంలోనే గ్రామ సమీపంలోని స్తంభం వద్ద జంపర్ ఓపెన్ చేసి నిలిపేశారు. దీంతో దుండగులు వేసిన విద్యుత్ తీగతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇంత జరిగినా బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

## 'ఉపాధి' సామాజిక తనిఖీపై ప్రజావేదిక

సభకు ప్రజల నుంచి కానరాని స్పందన

కేసముద్రం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు, అంబుడ్స్‌మెన్ ఆదాం, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ మన్మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో హరిప్రసాద్, ఎస్ఆర్‌పీ కుమార్, డీఆర్‌పీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మండలంలో 40 గ్రామాలు ఉండగా మొదటి రోజు 27 గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరిగిన అవకతవకలను తనిఖీ బృందం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో ఉపాధి పథకంలో నాటిన మొక్కలు లేవని, రికార్డుల్లో నమోదైన పనులు క్షేత్రస్థాయి తక్కువగా ఉన్నాయని, కొన్నిచోట్ల రికార్డుల్లో సిబ్బంది సంతకాలు లేవని సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా పనులకు బాధ్యులైన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని అధికారులు ప్రశ్నించి వారు చెప్పే సమాధానాలను నమోదు చేసుకున్నారు. మంగళవారం రెండో రోజు మిగిలిన గ్రామాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదిక పరిశీలనలు పూర్తిచేసి చర్యలు తీసుకునే వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రజావేదికకు ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలు పార్టీల నాయకులు తప్ప ప్రజలు హాజరు కాకపోవడం గమనార్హం. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం అందజేశారు.



కేసముద్రం ప్రజావేదికలో అధికారుల ముందు వివరాలు చెబుతున్న సామాజిక తనిఖీ సభ్యులు

### భార్యాభర్తల తగాదాలో
## భర్తకు జైలుశిక్ష

తొర్రూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల తగాదాలో వ్యక్తికి జైలుశిక్ష పడినట్లు తొర్రూరు ఎస్సై ఉపేందర్ తెలిపారు. 2016 సంవత్సరంలో పెద్దవంగర మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఒక మహిళ తన భర్త గాడిపెల్లి వెంకన్న వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో అప్పుడు ఎస్సైగా ఉన్న సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా, తుది విచారణ అనంతరం సోమవారం తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత నిందితుడికి ఒక సంవత్సరం జైలుశిక్ష రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

### తెలంగాణలో
## రైల్వే సమస్యలు పరిష్కరించాలి

• రైల్వేబోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌కు ఎంపీ వద్దిరాజు వినతి

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. సోమవారం ఢిల్లీలోని రైల్ నిలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, సమస్యలు, నిధుల కేటాయింపు, రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, కొత్త ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు, పాతవాటి విస్తరణ, కోవిడ్‌కు ముందు రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ, అదనపు హాల్టులతోపాటు పలు సమస్యలను సతీష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, అన్నింటిపై చైర్మన్ సానుకూలంగా స్పందించారని, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.

## అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు

▸▸ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య




లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గార్ల మండల కేంద్రంలోని రైతు వేదిక మందిరంలో సోమవారం ప్రభుత్వం మంజూరు చేసిన 26మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని పేదలను క్షేత్ర స్థాయిలో గుర్తించి వారందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.కృష్ణవేణి, ఎంపీడీవో మంగమ్మ, ఏవో కావటి రామారావు రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, నాయకులు భూక్యా బాబులాల్, యాకుబ్‌పాషా, కోలా కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2211 | 2100 |
| పల్లికాయ (సూక) | 7160 | 6500 |
| పల్లికాయ (పచ్చిది) | 4800 | 4400 |
| కందులు | 6890 | 5540 |
| పెసళ్లు | 7524 | 4645 |
| పత్తి | 6960 | 5800 |
| పసుపు (కాడి) | 7607 | 7522 |
| పసుపు (గోల) | 6565 | 6233 |
| తేజ మిర్చి | 13600 | 9000 |
| డిడి | 12800 | 12500 |
| వండర్‌హాట్ | 16600 | 11500 |
| ఎల్లో మిర్చి | 17000 | 15000 |
| యూఎస్341 | 13000 | 9500 |
| దేశీ | 28000 | 25500 |
| సింగిల్‌పట్టి | 39000 | 29000 |
| దీపిక | 17000 | 15245 |
| తాలు మిర్చి | 6500 | 3000 |

- వరంగల్ వ్యవసాయం



కురవి మండలం రాజోలు జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన మూత్రశాల

# ఆలోచన అదిరింది.. సమస్య తీరింది

» విద్యార్థుల కోసం రూ.2 వేలతో మూత్రశాల తయారీ
» నూనె డబ్బాలు, పైపులతో రూపొందించిన పీఈటీ

అది కురవి మండలం రాజోలు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల.. మొత్తం 170 మంది విద్యార్థులున్నారు. వారిలో సుమారు 100 మంది అబ్బాయిలున్నారు. అయితే ఈ పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నా వాటిని విద్యార్థినులు ఉపయోగిస్తుండటంతో.. అబ్బాయిలు మూత్రవిసర్జన కోసం పాఠశాల బయటకు వెళుతుంటారు. ఈ క్రమంలో వారు మళ్లీ పాఠశాలలోకి సమయానికి రాకుండా బయట కాలక్షేపం చేస్తుండటంతో పాటు బహిరంగ మూత్ర విసర్జన చేయడంపై సమీపంలోని ఇళ్లవారు తరచూ అభ్యంతరం వ్యక్తం చేస్తుండటం లాంటివి జరుగుతున్నాయి. పరిస్థితిని గమనించిన పాఠశాలలోని క్రీడా ఉపాధ్యాయుడు పిల్లి కాశీనాథ్ ఓ ఆలోచన చేశారు. అతి తక్కువ ఖర్చుతో పాఠశాలలోనే ఓ మూత్రశాలను ఏర్పాటు చేసి ఔరా అనిపించారు. అధికారులద్వారా నిధులు మంజూరై శాశ్వత మూత్రశాలల నిర్మాణం జరగాలంటే చాలా సమయం పడుతుండటంతో తానే స్వయంగా ఓ మూత్రశాలను నెలకొల్పాడు. ఐదు లీటర్ల నూనె డబ్బాలు పది సేకరించి.. వాటిని తలక్రిందులుగా కట్‌చేసి విద్యార్థులు మూత్రం పోసేం దుకు అనువుగా ఉండే ఎత్తులో సైజుల వారీగా అమర్చాడు. పాఠశాలలో స్టోర్ రూంలో పడేసిన నాలుగు పాత పైపులను తెచ్చి.. దానికి నూనె డబ్బాలకు అమర్చారు. విద్యార్థులు పోసిన మూత్రం పైపుల ద్వారా బయటకు వచ్చేలా చేశాడు. ఇక కింది భాగంలో సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేసి.. పాఠశాలలో పనికి రాకుండా ఉన్న రేకులను వాటి చుట్టూ అమర్చి మూత్రశాలను తయారు చేశారు. ఇందుకోసం ఆయన కేవలం రూ.2 వేలను ఖర్చు చేశారు. ఇక ఇటీవల ఈ పాఠశాలను డీఈవో రవీందర్‌రెడ్డి సందర్శించిన సమయంలో కాశీనాథ్ తయారు చేసిన మూత్రశాలను చూసి అభినందించారు.






పీఈటీ కాశీనాథ్

- కురవి, ఆంధ్రజ్యోతి

# రామయ్య కల్యాణానికి తలంబ్రాలు

» ఖానాపురంలో సిద్ధమవుతున్న కోగోటి తలంబ్రాలు
» భద్రాద్రి సీతారాములకు సమర్పించనున్న భక్తులు



గోటి తలంబ్రాలను సిద్ధం చేస్తున్న భక్తులు

ఖానాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణం అంటే సాక్ష్యాత్తు లోక కల్యాణమే.. ఎక్కడెక్కడి నుంచో భద్రాచల రాముల వారి కల్యాణానికి భక్తులు తరలివస్తారు. ఈ కల్యాణానికి ఎంతటి ఖ్యాతి ఉందో ఆ కల్యాణంలో వినియోగించే గోటి తలంబ్రాలకు అంతే ప్రత్యేకత ఉంది. ఆ కల్యాణ వేడుకల్లో ఆ తలంబ్రాలను తాకితే ఎంతో పుణ్యమని భావిస్తారు భక్తులు. అటువంటి ఆ జానకీరాముల కల్యాణానికి వినియోగించే కోటి గోటి తలంబ్రాలను స్వయంగా తయారు చేస్తూ భక్తి పారవశ్యంతో మునిగితేలుతున్నారు వరంగల్ జిల్లా ఖానాపురం వాసులు.

సీతారాముల కల్యాణ మహోత్సవంలో పవిత్రంగా భావించే తలంబ్రాలు, పసుపు, ముత్యాలు, ధాన్యాలు వినియోగిస్తారు. వీటిలో వినియోగించే ఒక్కో వస్తువుకు ఓ ప్రత్యేకత ఉంటుంది. పసుపు సకల శుభాలకు దీపికగా, ముత్యాలు కల్మషంలేని మనస్సుతో ఆనందంగా జీవించాలని ప్రతీకగా, ఇక ధాన్యం ధన ధాన్యాలతో సరితూగాలని భావనగా ఉంటుంది. ఇంతటి విశిష్టత కలిగిన నవి జగత్ కల్యాణంగా భావించే భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవంలో దేవతామూర్తుల శిరస్సు నుంచి జాలువారేలా తలంబ్రాలు పోస్తారు. అటువంటి కల్యాణోత్సవంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను వినియోగిస్తారు.

### గోటి తలంబ్రాలు

శ్రీరామ నవమి రోజు భద్రాచలంలో జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలకు ప్రత్యేకత ఉంటుంది. వడ్ల గింజలను రోలులో దంచడంగాని లేక మిల్లులో మరపట్టించినవీ కావు. ఆలయంలో మహిళలు, భక్తులు చేతిగోళ్లతో ఒక్కొక్క ధాన్యపు గింజను ఒలిచి బియ్యంగా తయారు చేస్తారు. వీటినే గోటి తలంబ్రాలు అంటారు. రాములోరి కల్యాణంలో వినియోగించే గోటి తలంబ్రాలు సిద్ధం చేసే అరుదైన అవకాశం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులకు దక్కింది. కల్యాణ వేడుకలలో తలంబ్రాలను తాకితేనే ఎంతో పుణ్యమని భావిస్తారు భక్తులు. అయితే సాక్షాత్తు ఆ జానకీరాముడి కల్యాణానికి వినియోగించే గోటి తంలంబ్రాలను సిద్ధంచేసే మహత్తర కార్యక్రమంలో ఖానాపురం వాసులు కొన్నేళ్లుగా భాగస్వాములు అవుతున్నారు. ఆలయ చైర్మన్ గొల్లపుడి సుబ్బారావు, ఆలయ అర్చకుడు పర్వతపు శివప్రసాద్ శాస్త్రీ ఆధ్వర్యంలో భక్తులు మూడు నెలలుగా నిత్యం గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలను సిద్ధంచేస్తున్నారు. స్వామివారి సేవలో పునీతులవుతూ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు.



సీతారామచంద్రస్వామి ఆలయం

### పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం..



పర్వతపు శివప్రసాద్ శాస్త్రి, ఆలయ అర్చకుడు

భద్రాద్రిలో జరిగే సీతారాముల కల్యాణానికి ఉపయోగించే గోటి తలంబ్రాలను అందించే అవకాశం కలగడం పూర్వ జన్మ సుకృతమే. ఈ మహా సంకల్పంలో భక్తులు భాస్వాములు కావడం ఆనందంగా ఉంది. భగవంతుడికి సేవచేయడం వల్ల అందరికీ మంచి జరుగుతుంది.

### ధన్యులమయ్యాం..




జి. సుబ్బారావు, ఆలయ కమిటీ చైర్మన్

రాములవారి కల్యాణంలో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు. ఈ అక్షింతలకు కోటి తలంబ్రాలుగా చెబుతారు. గోటి తలంబ్రాల కార్యక్రమంలో భాగస్వాములైనందుకు ధన్యులమయ్యాం.

# మినీ తిరుపతి.. ఇంద్రకీలాద్రి

• భక్తుల కొంగు బంగారం శ్రీనివాసుడు • రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
• 14న వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం • నర్సింహులపేటలో ఆధ్యాత్మిక సందడి

నర్సింహులపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మినీ తిరుపతిగా ప్రఖ్యాతి పొందిన నర్సింహులపేట మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన పద్మావతి, అలివేలు మంగమ్మ సహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో ఆలయ పరిసరాలు బ్రహ్మోత్సవాల శోభను సంతరించుకున్నాయి. భక్తుల కొంగుబంగారంగా వెంచేసిన శ్రీనివాసుడు సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. మార్చి 14న నిండు పౌర్ణమి హోలీ రోజున జరిగే స్వామి వారి కల్యాణోత్సవానికి మండలం నుంచే కాకుండా ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ ఆలయానికి ఓ పురాణగాథ ఉంది. ఒకరోజు సంధ్య సమయంలో కొందరు పశువుల కాపరులు చూస్తుండగా సుమారు ఎనిమిదేళ్ల వయస్సు గల బాలుడు దిగంబరంగా ఇంద్రకీలాద్రి పర్వతంపైకి పరుగెత్తినట్టుగా, అక్కడ అదృశ్యమయ్యాడని, అంతలోనే కారుచీకట్లు కమ్ముకున్నాయని, ఆ పశువుల కాపరులు గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు జరిగిన విషయాన్ని చెప్పారట. అదేరోజు రాత్రి గ్రామంలో చిన్నపిల్లలు పాలకోసం తపించి ఎవరూ పాలు తాగకపోవడం, చెట్లు ఊగకుండా ప్రకృతి అంతా స్తంభించడం, నిద్రలో ఉన్నవారు కలవాటుకు గురవడం, ప్రజలంతా తావులేక భూమిని పట్టుకున్నట్లు, వెయ్యి ఏనుగులు ఒకేసారి గ్రామంపై పడినట్లు, ఇంద్రకీలాద్రి పర్వతంపై నుంచి దిగంబర బాలుడు పరుగెత్తిన మార్గం గుండా రబ్బరు బంతుల మాదిరిగా సుమారు మూడు కిలోమీటర్ల వరకు విస్తరించినట్టు ఒక కథ ప్రచారంలో ఉన్నది. అయితే నాడు వెలువడిన శబ్దాలకు చుట్టుపక్కల ప్రజలు వేలాదిగా అక్కడకు తరలివచ్చి తర్జన భర్జన పడుతున్న సమయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి తన మహిమతో అక్కడే ఉన్న ఒక బాలికకు పూనకం రూపంలో వచ్చిన తాను సర్పాకారంలో స్వయంశక్తి స్వరూపుడుగా భక్తులను తరింపచేయడానికి అవతరించానని తన ఆంతర్యాన్ని తెలియజేసినట్లు చెబుతారు.



ఆలయంలో స్వామివారు



ఇంద్రకీలాద్రి పర్వతంపై వెంకటేశ్వరస్వామి ఆలయం

### బ్రహ్మోత్సవాల షెడ్యూల్..

మార్చి 12న పాల్గుణ త్రయోదశి రాత్రి 8 గంటలకు తొళక్కంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా, 13న బిందెతీర్థం ప్రాబోధిత ప్రబంధసేవాకాలం, పరమపథోత్సవం, తీర్థప్రసాదం గోష్టి, 14న విశ్వక్సేనారాధన పుణ్యాహచనం, అంకురార్పణం, బేరీపూజ, దేవతారోహనం, హోమం బలిహరణం తర్వాత రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం. 15న హోమం బలిహరణం, పురవీధి సేవ, సదస్యం, తీర్థప్రసాదగోష్టి, 16న పూర్ణాహుతి, ధ్వజపట ఉద్వాసన, పుష్పయాగం, ఏకాంతసేవ, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు ముగింపు జరగనుంది.

# దక్కని అవకాశం.. నేతల్లో అంతర్మథనం!

(5వ పేజీ తరువాయి)

వారి వర్గీయుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. తమతమ నేతలకు పెద్దల సభకు వెళ్లే అవకాశాలు కల్పించకపోవడం వెనుక ఏం జరిగి ఉంటుందా అంటూ చర్చించుకుంటున్నారు. అయితే ఓరుగల్లు మూలాలు ఉన్న సినీనటి విజయశాంతికి అనుహ్యంగా ఎమ్మెల్సీ పదవి దక్కటం కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత ఊరటగా భావిస్తున్నారు. విజయశాంతి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం తమ సొంత గ్రామంగా చెప్పుకొన్నారు. దీంతో ఎవరూ ఊహించని విధంగా రాములమ్మగా పిలుచుకునే విజయశాంతికి ఎమ్మెల్సీగా పదవి రావటం ఓరుగల్లువాసుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

### అనైక్యతే పదవికి అడ్డుగా

### మారిందా?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతల మధ్య అనైక్యతే ఒక్కరికి కూడా ఎమ్మెల్సీ పదవి రాకుండా అడ్డుపడిందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో మొదటి నుంచి మంత్రి సురేఖతో కొంతమంది ఎమ్మెల్యేలకు విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే మంత్రి సురేఖ భర్తకు ఎమ్మెల్సీ టికెట్ రాకుండా కాంగ్రెస్‌లోని ఓ వర్గం అధిష్టానంపై ఒత్తిడి తెచ్చిందనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా కొత్త పేర్లను తెరపైకి తీసుకవచ్చి, వారికి టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని సమాచారం. ఉమ్మడి జిల్లా నేతల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఒక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి.. మరో వర్గాన్ని దూరం చేసుకోవడం ఎందుకని, పార్టీ వరంగల్ నేతల పేర్లను పరిగణనలోకి తీసుకోలేదనే చర్చ ఉంది. ఇదే అనైక్యత పార్టీలో ఉంటే టీపీసీసీలో పదవులతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీల్లోనూ ఆధిపత్య పోరుతో ఎవరికి పదవులు రావనే చర్చ జరుగుతోంది. టీపీసీసీలో పదవి కోసం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో స్వయంగా రాజేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీ నుంచి ఏం ఆశిస్తున్నారని నాయినిని ప్రశ్నించినట్టుగా తెలిసింది. తనకు ప్రభుత్వంలో పదవులకంటే పార్టీలోనే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కావాలని కోరినట్లుగా ప్రచారం జరుగుతోంది. నాయినితో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు ఎస్సీ, ఒకరు ఎస్టీ, ముగ్గురు ఓసీ సామాజిక వర్గాలకు చెందిన నేతలు సహా మొత్తం ఎనిమిది మందిని మీనాక్షి నటరాజన్ వ్యక్తిగతంగా కలుసుకుని పార్టీ, ప్రభుత్వ పదవులపై ఆరా తీశారు. అంతేకాకుండా వీరిలో పార్టీ కోసం పని చేసినవారు, త్యాగాలు చేసిన వారు ఎవరెవరున్నారో ఆరా తీసి ఓ నివేదిక తయారు చేసినట్టు సమాచారం. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య అనైక్యత ఇలాగే కొనసాగితే పార్టీలో ఎవరికి కూడా కీలకమైన పదవులు వచ్చే అవకాశం ఉండదనే చర్చ పార్టీ క్యాడర్‌లో కొనసాగుతోంది. ఇప్పటికే ఎమ్మెల్సీ సీటు వరంగల్ నేతలకు దక్కకపోవటంతో నారాజ్‌గా ఉన్న నేతలు పదవులు కూడా రాకుంటే, పార్టీలో వరంగల్ ప్రాధాన్యం తగ్గుతుందనే చర్చ జరుగుతోంది.


### గులాబీ, కామ్రేడ్లకూ షాకే...

శాసనసభలో ఉన్న బలబలాల దృష్ట్యా బీఆర్‌ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ పదవి దక్కుతుంది. అయితే పలు సమీకరణల నేపథ్యంలో ఆ ఒక్క సీటు కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతకే దక్కుతుందన్న ఆశలో ఉన్నారు. ఇక ఈ నెల 27వ తేదీతో ఎమ్మెల్సీ పదవీకాలం ముగుస్తున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు గులాబీ పార్టీ మరో అవకాశం ఇస్తుందనే ప్రచారం జరిగింది. ఇటీవలే ఆమెను శాసనమండలిలో పార్టీ విప్‌గా నియమించారు. దీంతో పదవీకాలం పూర్తవుతున్న సమయంలో విప్‌గా నియమించటంతో.. మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం వచ్చినట్లేనని భావించారు.

చివరి నిమిషం వరకు కూడా సత్యవతిరాథోడ్ పేరు వినిపించినా అనూహ్యంగా నల్లగొండ జిల్లాకు చెందిన బీసీ నేత దాసోజు శ్రావణ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ సీటు ఖరారు చేయటంతో ఓరుగల్లు గులాబీ నేతలు డీలా పడ్డారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరు కూడా ప్రముఖంగా వినిపించినప్పటికి కుల సమీకరణలో ఎర్రబెల్లికి కూడా పదవి అందకుండా పోయిందని తెలుస్తోంది. అలాగే పొత్తులో భాగంగా సీపీఐకి కాంగ్రెస్ ఒక ఎమ్మెల్సీ సీటును కేటాయించింది. అయితే వరంగల్‌కు చెందిన ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావుకు దక్కుతుందని కామ్రేడ్లు భావించారు. చివరకు సీపీఐకి కేటాయించిన ఆ సీటు కూడా నల్లగొండ నేతనే వరించటంతో ఓరుగల్లు కామ్రేడ్లకు నిరాశ మిగిలింది. మొత్తానికి కొద్దికాలంగా ఎమ్మెల్సీ సీటుపై గంపెడాశలు పెట్టుకున్న నేతలకు ఆయా పార్టీల అధిష్టానాలు ఝలక్ ఇవ్వడంతో ఇటు నేతలు, అటు క్యాడర్ అంతర్మథనంలో పడ్డారు.

# నేటి నుంచి ఫాతిమామాత ఉత్సవాలు

» రాష్ట్రవ్యాప్తంగా హాజరు కానున్న క్రైస్తవులు » భారీ ఏర్పాట్లలో కేథడ్రల్ చర్చి ఆవరణ
» ఉత్సవాలు విజయవంతం చేయాలి : బిషప్ ఉడుముల బాల



ఫాతిమా కేథడ్రల్ చర్చి

కాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యేటా మార్చిలో నిర్వహించే ఫాతిమామాత ఉత్సవాలు ఈ నెల 11, 12, 13 తేదీలలో జరుపుకునేందుకు హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఫాతిమా కేథడ్రిల్ చర్చి ముస్తాబైంది. 72 ఏళ్లుగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విశ్వాసులకు క్రైస్తవ మత బోధకులు ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేయనున్నారు. ఇందులో భాగంగా మరియమాతకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఫాతిమామాత ఉత్సవాల సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం ఫాతిమా కేథడ్రిల్ ప్రాంగణం భారీలో ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

### మూడు రోజుల పాటు ఉత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా 11వ తేదీ మంగళవారం వివాహితులకు రజతోత్సవాల ప్రత్యేక పూజలు, స్వర్ణ జూబ్లీ వేడుకలు, దంప తుల వాగ్దాన నూతనీకరణ కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం కుటుంబాల సంరక్షణ అంశంపై బిషప్ డాక్టర్ ఉడుముల బాల దివ్యబలి పూజ చేయనున్నారు. 12వ తేదీ మహోత్సవ పూజ ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 5.30 నిమిషాలకు పురవీధులలో ఫాతిమామాత స్వరూపంతో మహారథ యాత్ర నిర్వహించనున్నారు. 13వ తేదీ చివరి రోజు గురువారం సాయంత్ర 6.30నిమిషాల నుంచి ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి. కాగా, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని బిషప్ ఉడుమల బాల కాజీపేట మీడియా పాయింట్‌లో జరిగిన మీడియా సమావేశంలో కోరారు. అనంతరం ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓరుగల్లు పీఠం ఫాదర్‌లు పాల్గొన్నారు.

### చర్చి ప్రాశస్త్యం

ఫాతిమా కేథడ్రల్ చర్చి భక్తులకు క్రీస్తు వరాలకు, స్వస్థతలకు నిలయంగా నిలుస్తోంది. పోర్చుగల్ దేశం నుంచి ఫాతిమామాత స్వరూపం విగ్రహం కొలువై ఉన్న ఆలయమే ఫాతిమా కేథడ్రల్ చర్చి. నాటి నుంచి నేటివరకు ఆ ప్రాంగణంలో రోగులకు స్వస్థత ప్రార్థనలు, మానసిక వేదనలు అనుభవించే వారిని దీవిస్తూ ప్రార్థనా వాతావరణంలో కనుల పండుగగా జరుపునే ఉత్సవమే ఫాతిమామాత ఉత్సవం.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిషప్ ఉడుముల బాల



కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

# కల్యాణం.. కమనీయం

**వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం**

గీసుగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభ వంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలుత ఉత్సవమూర్తులకు హనుమత్ సేవ, నిత్యవిధి హోమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాగా, సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిం చేందుకు జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్దసం ఖ్యలో తరలివచ్చారు. ఆలయ గుట్టపై నుంచి ఉత్సవ మూర్తులైన లీలాదేవి, భూదేవి, లక్ష్మీనరసింహస్వామివా రిని పల్లకీలో ఆలయ దిగువన ఉన్న కల్యాణ మండపానికి వేదమంత్రోచ్చరణలతో తీసుకువచ్చారు. భక్తి పారవశ్యంతో పల్లకీని మోసేందుకు భక్తులు పోటీ పడ్డారు. కొమ్మిడి వంశస్థులు అమ్మవార్లకు తలంబ్రాలు, తాళిపుస్తె, మట్టెలు తీసుకువచ్చారు. మాంగళ్యధారణ సమయంలో భక్తులు చేసిన గోవిందా నామస్మరణలో మిన్నంటాయి. కాగా, ఉత్సవమూర్తులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, విష్ణుచార్యులు, ఫణీంద్రాచార్యులు, సీఐ మహేందర్, నాయకులు చాడా కొమురారెడ్డి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, తుమ్మనపెల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.





స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు

# నేడు కొండపర్తికి గవర్నర్

» దత్తత గ్రామానికి రానున్న జిష్ణుదేవ్ వర్మ
» అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
» గ్రామస్థులతో సమావేశం.. అనంతరం సమ్మక్క సారలమ్మల దర్శనం
» పటిష్ఠ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

ములుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గతేడాది ఆగస్టులో ములుగు పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్రమంత్రి ధనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తికి స్పందించి తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం ఆ ఊరి అభివృద్ధికి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈక్రమంలో పనులు పూర్తికాగా మంగళవారం గవర్నర్ వాటిని ప్రారంభించేందుకు అడవిపల్లె కొండపర్తికి రానున్నారు. గ్రామస్తులతో సమావేశమవుతారు. తర్వాత మేడారం సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకోనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. గవర్నర్ స్పందనతో కేవలం 79గడపలు, 370 జనాభా కలిగిన అటవీ గ్రామమైన కొండపర్తి రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వా డీలకు నూతన భవనాలు నిర్మించారు. డిజిటల్ బోధనను అమలు చేస్తున్నారు. మహిళలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం మసాలా తయారీ, టైలరింగ్, నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివాసీ రైతుల వ్యవ సాయ అవసరాల కోసం బోరు మోటారును అందుబాటు లోకి తెచ్చారు. మరుగుదొడ్లు, అంతర్గతరోడ్లు, తాగునీటి వసతిని మెరుగుపర్చారు. సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అందరికీ ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇండ్లను మంజూరు చేశారు.

### కొండపర్తిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. అదనపు కలెక్టర్‌లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఇతర జిల్లా అధికారులతో కలిసి సోమవారం రాత్రి గ్రామానికి వెళ్లిన కలెక్టర్ టీఎస్.దివాకర ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. కొండపర్తిని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేశారు.



కొండపర్తిలో నిర్మించిన నైపుణ్య శిక్షణ కేంద్రం

### గవర్నర్ పర్యటన జరగనుందిలా..

గవర్నర్ ములుగు జిల్లా పర్యటన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. మంగళవారం ఉదయం రాజ్‌భవన్ నుంచి ఉదయం 8గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి 10:30 గంటలకు ములుగుకు చేరుకుంటారు. గట్టమ్మ సమీ పంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కొద్దిసేపు సేద తీరుతారు. 11:15గంటలకు తాడ్వాయి మండలం కొండపర్తికి చేరుకుంటారు. అభివృద్ధి పనులను ప్రారంభించిన తర్వాత గ్రామస్థులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12:45 గంటలకు మేడారం వెళ్తారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకుంటారు. స్థానిక ఐటీడీఏ అతిథి గృహంలో భోజనం చేసిన తర్వాత 2:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.



## ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌కు 2020లో దరఖాస్తు చేసుకున్న వారు మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ అవకాశం కల్పించినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి సునీల్, భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ రాము అన్నారు. మంజూర్ నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రియల్టర్లు, ఏజెంట్లు, దస్తావేజు లేఖరులకు ఎల్ఆర్ఎస్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2020లో ఎల్ఆర్ఎస్‌కు అప్లయ్ చేసుకొన్న వారు ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా రియల్టర్ల అనుమానాలు, సందేహాలకు ప్రభుత్వం కల్పించే అవకాశాలు, రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు.

## పాఠశాల వంట గదిలో గ్యాస్ లీకేజీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రైమరీ పాఠశాల వంటగదిలో గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. దీంతో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ఈ ఘటన భూపాల పల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాశీంపల్లి గ్రామం సోమవారం చోటు చేసుకుంది. ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైమరీ పాఠశాలలో సుమారు 80 మంది విద్యార్థినీ, విద్యార్థునులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి మధ్యాహ్నం వంట ఇదే పాఠశాలలోని ఓ గదిలో ప్రతిరోజూ తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో రోజూమాదిరిగా వంట చేస్తుండగా వంట గ్యాస్ పైపు పగలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వంట రూము అంత వ్యాపించగా గ్యాస్ స్టౌవ్ మొత్తంగా కాలిపోగా వంట సరుకులు సైతం దగ్ధమయ్యాయి. ఆ వెంటనే విద్యార్థులంతా పాఠశాల ప్రాంగణం నుంచి బయటకు వచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేశారు.

## పరుశురాంపల్లి వాసుల నిరసన

గణపురం, మార్చి 10: వాయు, శబ్ద కాలుష్యాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తమ గ్రామాన్ని వెంటనే తరలించాలని ఓపెన్‌కాస్టు -3 ప్రభావిత ప్రాంతమైన పరుశురాంపల్లి వాసులు సోమవారం నిరసనకు దిగారు. పరుశురాంపల్లి నుంచి ఓసీ-3కి వెళ్లే దారిలో టెంట్ వేసుకుని ధర్నా చేశారు. ఓపెన్ కాస్టు నుంచి తీవ్రమైన దుమ్ముధూళి వెలువడుతోందని, బ్లాస్టింగ్ పేలుళ్లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా తమ విలువైన వ్యవసాయ భూములను ప్రాజెక్టుకు ఇస్తే ఉపాధి అవకాశాలు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కారణంగా బొగ్గు రవాణా స్తంభించడంతో సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. ఈ డిమాండ్లను సింగరేణి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు నిరసనను విరమించారు.

# నీళ్లు లేక పంటలు ఎండిపోవద్దు



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దివాకర

**వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల**

ఏటూరునాగారం రూరల్, మార్చి10, (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడి రబీ పంటలు ఎండిపోకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి మంత్రులు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ దివాకర పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నట్లు ప్రతిపక్షాలు ఎక్కువ చేసి చూపుతున్నాయని, ప్రభుత్వానికి వ్యతిరేక వాతావరణం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రులు అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను అధికారులు చెక్‌పెట్టాలని, నీటిపారుదల శాఖ అధికారులు, విద్యుత్తు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంటలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నీటి కొరతను అధిగమించేందుకు సమర్థంగా పనిచేయాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్తు, నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమన్వయంతో పరిశీలించి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాలు వరి సాగు అయిందని, దేవాదుల ప్రాజెక్ట్ వద్ద జనగాం, సూర్యాపేట, యాద్రాద్రి జిల్లాల్లో కొంత మేర నీటి ఇబ్బందులున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో నీటి పారుదల శాఖ అధికారులతో అవసరమైన నీటి విడుదలను కట్టుదిట్టంగా చేస్తామన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం, బోర్లు ఎండిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకునేలా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

## గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం రానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్ల పటిష్ఠంగా పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కొండపర్తిలో తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. అతిథి గృహాన్ని సిద్ధం చేయాలన్నారు. గవర్నర్ సందర్శన సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్‌లు సీహెచ్.మహేందర్‌జీ, జి.సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్, ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఆయాశాఖల జిల్లా విభాగాధిపతులు పాల్గొన్నారు.

## కమనీయంగా శ్రీనివాసుడి కల్యాణం



ఉత్సవ మూర్తులకు తలంబ్రాలను పోస్తున్న అర్చకులు

మంగపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురం బిల్ట్ కాలనీలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి కల్యాణం సోమవారం అత్యంత వైభవంగా జరిగివంది. అర్చకులు సుప్రభాతం, విశ్వక్సేణపూజ, పుణ్యాహావచనం, పంచ కలషాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ మంటపం వద్దకు చేర్చారు. ప్రధానార్చకుడు ప్రతాపురం శ్రీనివాసాచార్యులు, ప్రతాపురం వంశీకృష్ణమా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కలకోట రామాచారి, కాటూరి రామా చంద్రాచార్యులు ఉత్సవమూర్తులను అధిరోహించి కల్యాణ తంతును నిర్వహించారు. సుమారు 10 వేల మంది భక్తుల ఈ వేడుకలో పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఎస్సైలు సూరి, సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించారు. తహసీల్దార్ తోట రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, మంగపేట మాజీ ఎంపీపీ పచ్చ శేషగిరిరావు, స్థానిక ఎస్సై సూరి, ప్రోబేషనరి ఎస్సై సురేష్‌తో పాటు పలువురు గ్రామ ప్రముఖులు, వివిద రాజకీయ ప్రముఖులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## బీసీ సర్టిఫికెట్ల జారీపై నిఘా వర్గాల ఆరా!

మహదేవపూర్ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఓపెన్ క్యాటగిరీలోని ఓ వర్గానికి చెందిన వారికి బీసీ సర్టిఫికెట్లు జారీ చేయడమే కాకుండా అర్హత లేనివారికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీనిపై నిఘా వర్గాలు కూపిలాగుతున్నాయని తెలిసింది. ఎవరా మీ-సేవ నిర్వాహకులు, ఆ సింగరేణి ఉద్యోగి ఎవరు? అనే కోణంలో విచారణ చేసినట్లు సమాచారం. అక్రమంగా ఈసర్టిఫికెట్లు ఎంత మంది పొందారు.. వీటి ఆధారంగా ఉద్యోగాలు పొందిన వారు ఎవరు? అనే వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే అసలు ఈవిషయం బయటకు ఎలా తెలిసి ఉంటుంది అని సింగరేణి ఉద్యోగి సహ అక్రమాలకు పాల్పడుతున్న మీ-సేవ నిర్వాహకులు చర్చించుకున్నట్లు తెలిసింది. గుట్టుచప్పుడు కాకుండ ఈఅంశాన్ని ముగించేందుకు ఓ జిల్లా అధికారి సహకారంతో ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిసింది. ఇదే కథనంపై ఉన్నతాధికారులు సైతం లోతైన విచారణ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. .

**చర్యలు తీసుకోవాలి : ఎమ్మార్పీఎస్**

అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. గతంలోనూ మహదేవపూర్ మండలంలో బీసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేసిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి సంబధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

(5వ పేజీ తరువాయి)

నరసింహస్వామిని ఊరేగింపుగా కల్యాణ మండపంలోకి తీసుకొచ్చారు. మంగళసూత్రాలను భక్తులు కళ్లకు అద్దుకొని మొక్కుకుని పరవశించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కోటంచ ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో మహేష్, ఆలయ చైర్మన్ భిక్షపతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, బీఆర్ఎస్ శాసన మండలి పక్షనేత మధుసూదనాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన హాజరయ్యారు.



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

## వర్గీకరణ తర్వాతే ఫలితాలు విడుదల చేయాలి : ఎమ్మార్పీఎస్



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగ, పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అన్నారు. జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్షలు చేపట్టారు. బీఆర్ఎస్ నాయకుడు గండ్రకోట సుధీర్ యాదవ్ సంఘీభావం తెలిపి నిరసనకారులకు పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా విడుదల చేసే ఫలితాలు, నోటిఫికేషన్‌లను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మరాఠి రవీందర్, రొంటాల భిక్షపతి, దూడపాక రాజు, బొచ్చు అరవింద్, కల్వల శ్రీను, సామర్ల వంశీ, ఇనుముల కుమార్, సాగర్, సంజీవ, కిరణ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహ సిబ్బందికి వైద్య పరీక్షలు

వాజేడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు పీహెచ్‌సీ పరిధిలోని బాలుర ఆశ్రమ పాఠశాలలోని సిబ్బందికి సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు సిబ్బంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. హెచ్ఈవో వేణుగోపాలకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ నవీన్, హెచ్‌ఏలు తిరుపతి, శ్రీనివాస్, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## డిజిటల్ చెల్లింపులపై అవగాహన పెంచుకోవాలి

**ఆర్బీఐ ఏజీఎం రాధికా భరత్**

ములుగు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన డిజిటల్ చెల్లింపులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆర్బీఐ ఏజీఎం రాధికా భరత్ అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం బండారుపల్లి, రాంసింగ్‌తండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఖాతాదారుడూ డిజిటల్ పేమేంటెస్‌ను అలవాటు చేసుకోవాలన్నారు. యాప్‌ల సేవలను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవ్వరైనా ఖాతాదారుడు మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. లోన్‌యాప్స్ ద్వారా రుణాలు తీసుకోవద్దన్నారు. తెలియని వ్యక్తుల ద్వారా ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో టీజీబీ నోడల్ అధికారి ఎ.శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్‌కుమార్, ములుగు మేనేజర్ నరేష్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ మహేష్, సుహాసిని పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు నివాళి

ములుగు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ములుగులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసిన నాయకుల నివాళులర్పించారు. ఈసందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి మాట్లాడుతూ.. తొలి ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి మహిళా చైతన్యం కోసం కృషి చేశారన్నారు. అసమానతలు లేని సమాజ స్థాపనకోసం, మూఢనమ్మకాల నిర్మూలనకు పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జన్ను రవి, పొడాల ఓంప్రకాశ్, ఎమ్డీ.అహ్మద్‌పాషా, ఓరుగంటి అనిల్, గందె రాజు, గందె మధు, గాదె రాజు, మాదారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ

ములుగు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అలింకో-సమగ్ర శిక్ష సహకారంతో జిల్లాలోని పలువురు దివ్యాంగ విద్యార్థులకు సోమవారం ఉపకరణాలను పంపిణీ చేశారు. ములుగులోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లను అందజేశారు. దివ్యాంగులకు సేవ చేస్తే దేవుడికి చేసినట్లేనని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అర్షం రాజు, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, అలింకో సంస్థ ప్రతినిధి ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎం కుటుంబానికి ఆర్థికసాయం

గోవిందరావుపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఏఎన్ఎంగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన సురేఖ కుటుంబాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం పరామర్శించారు. ఉద్యోగులంతా కలిసి సేకరించిన రూ.71వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కొవిడ్ సమయంలో సురేఖ ప్రజలకు సేవలందించారని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కృషి చేశారన్నారు. ఆమె సేవలను మిగతా సిబ్బందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీకాంత్, మధు, డెమో సంపత్, విజయభాస్కర్, శకుంతల, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

కన్నాయిగూడెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ ఏటూరునాగారం డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిష్టరు, ఫార్మసీ స్టాక్ రిజిష్టరు, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంటు రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న బర్త్ వెయిటింగ్ హాల్ పనులను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ భాగవతుల, హెల్త్ అసిస్టెంట్లు బానోత్ లక్ష్మణ్, ఓం ప్రకాశ్, ఎల్టీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఎంపిక పోటీల్లో ప్రతిభ




కరాటేలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

ఏటూరునాగారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కరాటే ఎంపిక పోటీల్లో ఏటూరునాగారం కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్ 40 కేజీల విభాగంలో మండల కేంద్రానికి చెందిన వసంత విశాల్ సాయి బంగారు మెడల్ సాధించాడు. జూన్ 14న డెహ్రాడూన్, ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అతడు ఎంపికైనట్టు ఏటూరునాగారం కరాటే అకాడమీ కోచ్ ఎమ్డీ. హుస్సేన్ తెలిపారు. 25 కేజీల విభాగంలో ఊరుగొండ అఖిలేష్ సిల్వర్, 25 కేజీల విభాగంలో భూక్యా అభిరామ్ కాంస్య పతకం గెలుచుకున్నారు. క్యాడెట్ గర్ల్స్ విభాగంలో అలువాల విష్ణుశ్రీ కాంస్య పతకం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ములుగు జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్బు అభినందించారు.

## నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కాటారం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడిపిలవంచ గ్రామంలో శ్రీ భూనీళ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరగనుందని దేవాలయ అర్చకుడు సంతోష్ చారి, నిర్వాహకులు భగత్, రాకేష్, సతీష్, నితీష్, మణికంఠ, మధుకర్, రంజిత్, శ్రీకాంత్, అశోక్, నారాయణ, భగవాన్‌రెడ్డి, శ్రీని వాస్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేష్, దేవయ్య, శేఖర్, కుమార్, సుబ్బారావు సోమవారం తెలిపారు. కర్రు నాగయ్య-కృష్ణకుమారి దంప తుల ద్వారా నిర్మించిన ఆలయంలో గ్రామంలో ఉత్సవమూర్తుల ఊరే గింపు అనంతరం వేదపండితులతో కల్యాణం వైభవంగా నిర్వహించ నున్నట్టు పేర్కొన్నారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మహదేవపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల దళిత వాడల్లో రోడ్లకు నిధులు కేటాయించి, అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ రాణిబాయి రామారావు, మాజీ జడ్పీటీసీ గూడాల అరుణ శ్రీనివాస్, ఎంపీటీసీ సుధాకర్, బ్లాక్ మైనారిటీ అధ్యక్షుడు అస్రార్, యూత్ టౌన్ అధ్యక్షుడు నయీం, కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ వామన్‌రావు, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు లింగాల సుందర్, సీనియర్ నాయకులు వెన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాల్వ గంగయ్య, ధర్మయ్య, రమేష్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

చిట్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిద పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను టీఎస్ పీఆర్టీయూ, జ్యోతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ఘనంగా సన్మానించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గెజిటెడ్ హెచ్ఎంలు ఝాన్సీరాణి, ఊర్మిళ, వాసంతి, ఉపాధ్యాయినీలు లక్ష్మి, పల్లవి, కళ్యాణి, రాధికారాణి, ధనలక్ష్మి, శ్రీదేవి, సుజాత, నీలిమారెడ్డి, సుమలత, సునీత, జాహిద్ సాల్మా, నవత, శ్రీలత, మమత, వాణిని సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో కోడెపాక రఘుపతి, టీఎస్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, కుసునపు కిరణ్ కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సాంబమూర్తి, ప్రిన్సిపాల్ రమేష్, సంఘం బాధ్యులు రాంనారాయణ, శ్రీనివాస్, లింగయ్య, సదానందం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి యువజన ఉత్సవాలు

భూపాలపల్లిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13 నుంచి నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ డెరెక్టర్ చింతల అన్వేష్ తెలిపారు. సోమవారం ఈ మేరకు సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని యువతీ యువకులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైటర్స్, ఆర్టిస్ట్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక జానపద నృత్యం (గ్రూపు), సైన్స్ ఎగ్జిబిషన్‌లలో ఆసక్తి ఉన్న వారు ఈ పోటీలకు దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

## సైక్లింగ్ విజేతలకు సన్మానం

ములుగు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈనెల 8న హైదరాబాద్‌లో జరిగిన సైక్లింగ్ పోటీలలో జిల్లాకు చెందిన 24మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు గెల్చుకున్నారు. వీరిని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ సోమవారం సన్మానించారు. గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడం పట్ల అభినందించారు. క్రీడాకారులకు అవసరమైన సైకిళ్లను అందిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో తుల రవి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గణపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలపాలైన సంఘటన చెల్పూరు శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన నరేష్ భూపాలపల్లి నుంచి చెల్పూరు వైపు వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న కారు చెల్పూరులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో చెల్పూరు వైపు వస్తూ యూ టర్న్ తిరుగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఢీ కొనడంతో నరేష్‌కు గాయాలయ్యాయి.



డాక్టర్ మధుకర్, వాజేడు పీహెచ్‌సీ వైద్యాధికారి

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

**ఆంధ్రజ్యోతి:** వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

**డాక్టర్:** ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బయటకు రాకుండా ఉండాలి.

**ఆంధ్రజ్యోతి:** వడదెబ్బకు గురైతే ఏం చేయాలి ?

డాక్టర్: వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడ ప్రదేశం ఉంచి సపర్యాలు చేయాలి. దగ్గరలోని పీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందించాలి.

**ఆంధ్రజ్యోతి:** కూల్‌డ్రింక్స్ తాగొచ్చా?

**డాక్టర్:** వేసవిలో కూల్‌డ్రింక్స్ ఎక్కువగా తాగొద్దు. ఎక్కువ మొత్తం మంచినీరు, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్‌ను ఎక్కువ మోతాదులో తీసుకోవాలి.

**ఆంధ్రజ్యోతి:** వేసవిలో ఎలాంటి దుస్తులు ధరించాలి ?

**డాక్టర్:** ప్రయాణాలు చేసేటప్పుడు కాటన్ దుస్తులను వేసుకుంటే ఎండ తగిలిన కాస్త ఉపశమనం ఉంటుంది.

**ఆంధ్రజ్యోతి:** వడదెబ్బపై వృద్ధులకు, చిన్నారులకు మీరిచ్చే సలహా?

**డాక్టర్:** ఎండ తగలకుండా ఎక్కువ సమయం ఇంటి వద్దనే గడిపితే మంచిది.

**ఆంధ్రజ్యోతి:** వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా ?

డాక్టర్: గ్రామాల్లో ఆశా కార్యకర్తల ద్వారా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయా ?

**డాక్టర్:** ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులోనే ఉన్నాయి. అవసరమైన వారికి అందిస్తున్నాం

- వాజేడు (ఆంధ్రజ్యోతి)

# ఉపాధి హామీ పనులు ప్రారంభం

కాటారం, మార్చి10(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామపంచాయతీల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమై కొన సాగుతున్నాయి. సోమవారం కాటారం, గుమ్మళ్ల పల్లి, ఒడిపిలవంచ, జాదారావుపేట, దామెరకుంట, కొత్తపల్లి, మేడిపల్లి, చింతకాని, అంకుసాపూర్ తదితర జీపీల పరిధిలో 600మందికి పైగా కూలీలు పనులు చేసినట్లు అధికారులు తెలిపారు.

పనులను గుర్తించి కూలీల సంఖ్యను పెంచడానికి కృషి చేస్తున్నట్లు ఏపీవో వెంకన్న తెలిపారు. పలు గ్రామాల పరిధిలో ఆటవీప్రాంతంలో ఫారం పాండ్స్ (నీటి గుంటలు), పొలాలు, గ్రామాల మధ్య ఫార్మే షన్ రోడ్లు చేపడుతున్నారు. మిర్చి ఏరడం, పొలా ల్లో కలుపుతీయడం వంటి వ్యవసాయ పనులు ఉండటంతో కూలీలు ఈజీఎస్ పనులకు పెద్ద సంఖ్యలో రావడం లేదని, మరో వారం రోజుల్లో వేలాది మంది కూలీలు రానున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో పనులు కావాలని కూలీలు కోరిన చోట డిమాండ్‌కు తగినట్లు పనులు చేపట్టాని ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలను ఎంపీడీవో అడ్డూరి బాబు, ఏపీవో వెంకన్న ఆదేశించారు.